క్లుప్తంగా

నానో యూరియాతో అధిక దిగుబడి

మల్దకల్: నానో యూరియాతో అధిక దిగుబడి పొందవచ్చని మండల వ్యవసాయాధికారి రాజశేఖర్ రైతులకు సూచించారు. సోమవారం స్థానిక సింగిల్ విండో కార్యాలయంలో రైతులకు నానో యూరియాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రైతులు రసాయనిక ఎరువులతో పాటు నానో యూరియాను వాడటం ద్వారా అధిక దిగుబడులు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో సీఈఓ కిరణ్‌కుమార్ రెడ్డి, ఏఈఓ ఖాజాపాష పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

శాంతినగర్: వడ్డేపల్లి మున్సిపాలిటీ పరిధిలోని ఆయా వార్డుల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ కార్యాలయంలో బీజేపీ నాయకులు వినతిపత్రం అందజేశారు. 3, 7, 9 వార్డుల్లో సమస్యలు అధికంగా ఉన్నాయని సీసీ రోడ్లు, డ్రైయినేజీలు, వీధిలైట్లు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు మధుసూదన్‌గౌడ్, జిల్లా కార్యవర్గ సభ్యులు వెంకటేశ్వర్లు, సంజన్నగౌడ్, శేఖర్‌ఆచారి, పరుశరాముడు తదితరులు పాల్గొన్నారు.

అధికారులు తీరు మార్చుకోవాలి



రాజోళి: అధికారులు ప్రజా సమస్యలు పట్టించుకోవడం లేదని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సంజీవరెడ్డి మండిపడ్డారు. మండల కేంద్రంలో పలు సమస్యలపై అధికారులకు సమాచారం ఇస్తే, దానికి పరిష్కారం చూపకపోగా స్పందించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేవలం అధికార పార్టీ నాయకులకు మాత్రమే స్పందిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా బురదమయమైన రోడ్లను పరిశీలించారు. వర్షాలకు దెబ్బతిన్న రోడ్లకు వెంటనే మరమ్మతు చేపట్టాలని ఆయన కోరారు. కార్యక్రమంలో గజేంద్రరెడ్డి, శివరాంరెడ్డి, పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కట్టడాలు తొలగించాలి



కేటీదొడ్డి: సీసీరోడ్డుపై ఉన్న అక్రమ కట్టడాలను తొలగించాలని ఎంపీడీఓ రమణారావుకు సోమవారం ఇందిరమ్మ కాలనీ వాసులు వినతిపత్రం అందజేశారు. మండల కేంద్రంలోని ఉన్న ఇందిరమ్మ కాలనీలో సీసీరోడ్డు ఆక్రమించి, ఇల్లు నిర్మించినట్లు తెలిపారు. దీంతో ట్రాఫిక్ సమస్య తలెత్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో టీచర్ గోవిందు, భీమన్న, పాండు తదితరులు పాల్గొన్నారు.

డీలర్‌పై చర్య తీసుకోండి

మానవపాడు: మండలంలోని కొర్విపాడు గ్రామంలో అక్రమంగా డబ్బులు వసూలు చేసిన రేషన్ డీలర్‌పై చర్య తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ సోమవారం డీఆర్‌డీఓ, అడిషనల్ కలెక్టర్ నర్సింగరావుకు వినతిపత్రం అందజేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు జయరాజ్, శ్రీను, రుక్మత్‌దౌల, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఎస్‌ఎస్ ప్రయాణం దేశ సేవలోనే



రాజోళి: ఆర్‌ఎస్‌ఎస్ ప్రయాణమంతా దేశ సేవలోనే సాగిందని రాష్ట్రీయ స్వయం సేవక్ నాయకులు అన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా మండల కేంద్రం ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేశారు. వ్యవస్థాపకుల ఫొటోలకు నివాళులర్పించారు. జీవితంలో మొదటి ప్రాధాన్యత దేశ సేవకేనని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఈసీ అంజనేయులు, శశికుమార్, ఆర్‌ఎస్‌ఎస్ సభ్యులు పాల్గొన్నారు.

ధరూరులో ముసురు వర్షం

ధరూరు: మండలంలో కురుస్తున్న ముసురు వర్షంతో వ్యవసాయ పనులకు తీవ్ర ఆటంకం కలిగింది. పత్తి, ఇతర పంటలకు నష్టం వాటిల్లే అవకాశం ఉందని రైతులు వాపోతున్నారు.





అలుగు పారుతున్న ఓబులోనిపల్లి ఆలయ చెరువు



ధరూరు చెరువు కింద సాగులో వరి

చెరువు ఆయకట్టుకు మహర్దశ

- నెట్టెంపాడు జలాలతో ఏటా పెరుగుతున్న సాగు
- నిండుకుండలను తలపిస్తున్న చెరువులు



నెట్టెంపాడు జలాలతో నిండిన మన్నాపురం చెరువు

ధరూరు: నెట్టెంపాడు ఎత్తిపోతల పథకం పుణ్యమా అంటూ మండలంలోని చెరువులు, కుంటలు నిండు కుండలను తలపిస్తున్నాయి. పథకం కింద ఉన్న ఆయకట్టుకు సమృద్ధిగా సాగునీరందడంతో బీడుగా మారిన చెరువు కింది ఆయకట్టుకు పూర్వ వైభవం కనిపిస్తోంది. వర్షాలతో సంబంధం లేకుండా నెట్టెంపాడు జలాలతో బీడు భూములు సాగులోకి వస్తున్నాయి. చెరువుల కింద సాగు ఏటా పెరుగుతుందని అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

చెర్వులకు సాగునీరు

నెట్టెంపాడు ఎత్తిపోతల పథకంలో భాగమైన ర్యాలంపాడు, గుడ్డెందొడ్డి రిజర్వాయర్లను వరదల సమయాల్లో నింపుతున్నారు. అనంతరం ఆ నీటిని కాల్వల ద్వారా చెరువులు నింపే ప్రక్రియను గత ఆరేళ్లుగా కొనసాగిస్తున్నారు. పూర్తిస్థాయిలో చెరువులను నింపడంతో రైతులు చెరువు కింద ఉన్న ఆయకట్టును సాగులోకి తెస్తున్నారు.

55 చెరువులు

మండలంలో మొత్తం 55 చెరువులు ఉన్నాయి. మిషన్ కాకతీయ పనులు చేపట్టిన చెరువులకు దాదాపుగా నెట్టెంపాడు జలాలు అందుతున్నాయి. అందులో దాదాపు 30 చెర్వులకు నెట్టెంపాడు ఎత్తిపోతల పథకం నీటిని విడుదల చేసి చెరువులను నింపుతున్నారు. గత ఏడాది రబీలో 1,956 ఎకరాల్లో వరి పంట సాగు చేశారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో 2,390 ఎకరాల్లో పంటలు సాగవుతున్నట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి.

మండలంలో ఇలా...

మండల పరిధిలోని ర్యాలంపాడు చెరువు నుంచి ఓబులోనిపల్లి, బూరెడ్డిపల్లి చెర్వులతో పాటు అక్కడి నుంచి ధరూరు చెరువుకు నీటిని విడుదల చేసి నింపుతున్నారు. ఇక్కడి నుంచి అలుగు పారుతున్న నీరు గద్వాల మండలం సంగాల చెరువుకు చేరుకుంటోంది. ఒక్క ధరూరు పెద్దచెరువు కిందనే దాదాపు 300 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందుతుంది. మండలంలోని ఆయా గ్రామాల చెరువుల కింద దాదాపు వెయ్యి ఎకరాల వరకు సాగవుతుందని రైతులు చెబుతున్నారు. నెట్టెంపాడు ప్రధాన కాల్వ వెంట ఉన్న మన్నాపురం చెరువును నింపి అక్కడి నుంచి అలుగు నీటితో సోంపురం, పారుచర్ల, పెద్దపాడు చెరువులు నింపారు. మండల పరిధిలోని కోతులగిద్ద, ఉ ప్పేరు, మార్లబీడు, అల్వలపాడు, కొత్తపాలెం, జాంపల్లి, దోర్నాల తదితర గ్రామాల చెరువులను ఏటా నింపి రైతులకు సాగు నీరందిస్తున్నారు. రెండు పంటలకు సాగు నీరందుతుండడంతో చెరువుల కింది ఆయకట్టు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

చెరువు నీటితో సాగు



పెద్దచెర్వు కింద మాకు వ్యవసాయ పొలం ఉంది. అందులో వరి సాగు చేస్తున్నాం. గత ఏడేళ్లుగా చెరువును నింపుతుండడంతో చెరువు కింద రైతులు ఖరీఫ్ పంటను సాగు చేసుకుంటున్నాం. ఆరేడేళ్ల కిందటి వరకు చెరువు కింద సాగుకు దిక్కే లేదు. – గోపిరెడ్డి, ధరూరు

ఆయకట్టుకు సాగునీరు



మండలంలోని ఆయా చెరువులకు నెట్టెంపాడు జలాలతో నింపడం జరుగుతుంది. చెరువు కింది ఆయకట్టుకు రెండు పంటలకు సాగు నీరందిస్తున్నాం. ఎక్కడ కూడా రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. – వినయ్, ఏఈ ఇరిగేషన్ శాఖ

అన్నదాన సత్రానికి స్థలం కేటాయించండి



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న పద్మశాలీ సంఘ నాయకులు

అలంపూర్: నిత్య అన్నదాన సత్రానికి స్థలం కేటాయించాలని పద్మశాలీ సంఘ నాయకులు మంత్రికి వినతిపత్రం అందజేశారు. అలంపూర్ క్షేత్ర ఆలయాలను దేవదాయ ధర్మదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ప్రిన్సిపల్ కార్యదర్శి శైలజా రామయ్యర్ సోమవారం అమ్మవారికి పట్టువస్త్రాలను సమర్పించారు. ఈ సందర్భంగా గద్వాల, అలంపూర్ పద్మశాలీ సేవా సంఘం నాయకులు జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత ఆధ్వర్యంలో మంత్రికి వినతిపత్రం అందజేశారు. భక్తులకు సరైన అన్నదాన సత్రం లేకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేసినట్లు వినతిలో పేర్కొన్నారు. పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో నిత్యాన్నదాన సత్రం ఏర్పాటుకు సంకల్పించినట్లు తెలిపారు. ఆలయాలకు సమీపంలో 3 ఎకరాల స్థలం కేటాయించి సంఘం పేరిట రిజిస్ట్రేషన్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పద్మశాలీ సంఘం నాయకులు పులిపాటి వెంకటేష్, పల్లె శ్రీనివాసులు, గడ్డం నాగన్న, గుర్రం వెంకటేశ్వర్లు, కస్తూరి సర్వేశ్వర్, పగుడాకుల నారాయణ తదితరులు పాల్గొన్నారు.

మంత్రికి స్వాగతం పలికిన ఎమ్మెల్యే

అలంపూర్: అలంపూర్ క్షేత్రానికి విచ్చేసిన దేవదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖకు ఎమ్మెల్యే విజయుడు పుష్పగుచ్ఛం అందజేసి ఘన స్వాగతం పలికారు. అనంతరం మంత్రితో కలిసి పట్టువస్త్రాలను సమర్పించి ఆలయాల్లో పూజలు చేశారు.

ప్రాసెసింగ్ పథకాలపై అవగాహన సదస్సు



మాట్లాడుతున్న ఏపీఓ భాస్కర్

అయిజ: ప్రధానమంత్రి ఎంప్లాయిమెంట్ జనరేషన్ ప్రోగ్రాంలో భాగంగా సోమవారం మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య భవనంలో జిల్లా పరిశ్రమల కేంద్రం సహకారంతో పొదుపు సంఘాల మహిళలకు ప్రాసెసింగ్ పథకాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఐపీఓ భాస్కర్‌రెడ్డి మాట్లాడారు. వ్యాపారాలను ఏ విధంగా అభివృద్ధి పరుచుకోవాలో వివరించారు. బ్యాంకుల్లో లోన్లు పొందడం, అర్హతలు విషయాలు వెల్లడించారు. కార్యక్రమంలో లీడ్ బ్యాంక్ అధికారి జ్యోతిప్రకాష్, డీఈసీ మేనేజర్ దయాకర్, అసిస్టెంట్ మేనేజర్ శ్యామల, ఏపీఎం జయకర్, పొదుపు సంఘాల మహిళలు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలకు భూమిపూజ



ఇటిక్యాల: మండల పరిధిలోని మునగాలలో సోమవారం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి కాంగ్రెస్ సీనియర్ నాయకుడు లక్ష్మీనారాయణరెడ్డి ముగ్గు పోసి భూమి పూజ చేశారు. లబ్ధిదారులు నాణ్యతతో వేగవంతంగా పనులు పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో కార్యదర్శి గంగాధర్, నాయకులు అశోక్, చాంద్‌బాష, రాంప్రసాద్, గోపాల్, లోకేష్, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గట్టు: మండల పరిధిలోని ఇందువాసి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని గ్రామాలకు మంగళవారం విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నట్లు ఏడీఈ గోపాల్, ఏఈ చిన్నయ్య సోమవారం తెలిపారు. అయిజ, ఇందువాసిలోని 132/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ల పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఇందువాసి, బోయలగూడెం, చమన్‌ఖాన్‌దొడ్డి గ్రామాల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నట్లు పేర్కొన్నారు. కావునా రైతులు, గృహ వినియోగదారులు సహకరించాలని ఏడీఈ, ఏఈ కోరారు.

చిన్నారులను పనిలో పెట్టుకోవద్దు



అవగాహన కల్పిస్తున్న కళాకారులు

గట్టు: బడిఈడు కల్గిన చిన్నారులను పనుల్లో పెట్టుకోవద్దని జిల్లా కార్మిక శాఖ అసిస్టెంట్ అధికారి వేణుగోపాల్ అన్నారు. పౌర సంబంధాల శాఖ, మండల విద్యాధికారుల ఆధ్వర్యంలో సోమవారం మండంలోని అంతంపల్లెలో కళాశాత ప్రదర్శనలు నిర్వహించారు. బాలకార్మిక వ్యవస్థ, బాల్య వివాహాల నిర్మూలనపై కళాకారులు ఆటపాటల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. 14 ఏళ్లలోపు పిల్లలను పనుల్లో పెట్టుకున్న వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్యదర్శి రవీందర్‌గౌడ్, తెలంగాణ సాంస్కృతిక సారథి ఉద్యోగులు హజరత్, కేశవులు, భూపతి తదితరులు పాల్గొన్నారు.

మంత్రి వచ్చినా ఫలితం శూన్యం



మాట్లాడుతున్న రామచంద్రారెడ్డి

అయిజ: రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అలంపూర్ జోగుళాంబ అమ్మవారిని నాలుగుసార్లు దర్శనం చేసుకున్నా సరే రూ.4 కూడా ఇవ్వలేదని బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి ఆరోపించారు. సోమవారం మండల కేంద్రంలో బీజేపీ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. అలంపూర్‌లో నిత్యాన్నదానం ఒక్క పూటకే పరిమితమయ్యిందని ఆరోపించారు. భక్తులకు కనీస వసతులు కూడా కల్పించడం లేదని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వ ప్రసాద్ స్కీం నుంచి రూ. 70 కోట్లు కేటాయిస్తే గత ప్రభుత్వం సరైన వసతులు కల్పించకుండా రూ. 22 కోట్లకు పరిమితం చేసిందన్నారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు భగత్‌రెడ్డి, మండల అధ్యక్షుడు గోపాలకృష్ణ, ఉపాధ్యక్షుడు లక్ష్మణ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సన్నాహక సమావేశం



మాట్లాడుతున్న జయన్న

అయిజ: స్థానిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో సోమవారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నాయకులు స్థానిక ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జయన్న మాట్లాడారు. ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రతి ఒక్కరికి వివరించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు మెగా హెల్త్ క్యాంప్

రాజోళి: స్వస్త్‌నారీ స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా నేడు మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో మెగా హెల్త్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు మెడికల్ అధికారి మధుబాబు తెలిపారు. మహిళలు, గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

ప్రధాన రోడ్డుపై పట్టింపేది?



శాంతినగర్- రాజోళి రోడ్డుపై దిగబడిన పత్తి వాహనం

రాజోళి: రాజోళి- శాంతిగనర్ ప్రధాన రోడ్డుపై వాహనాలు అదుపుతప్పి ప్రమాదాల బారిన పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గుంతలమయంగా ఉన్న రోడ్డుపై వర్షాలకు మోకాళ్ల లోతులో వర్షపు నీరు నిలుస్తున్నట్లు వాపోతున్నారు. సోమవారం రోడ్డుపై ఉన్న గుంతలో పత్తి వాహనం దిగబడినట్లు తెలిపారు. ద్విచక్రవాహనాల పరిస్థితి మరింత దారుణంగా ఉందన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతు చేయాలని కోరుతున్నారు.

సరస్వతీ.. నమస్తుభ్యం



శాంతినగర్‌లో కుంకుమార్చన పూజలు చేస్తున్న మహిళలు

సాక్షి నెట్‌వర్క్: జిల్లా వ్యాప్తంగా దేవి శరన్నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా సోమవారం అమ్మవారు సరస్వతీదేవిగా దర్శనమిచ్చారు. పలు ఆలయాల్లో అర్చకులు అమ్మవారికి అభిషేకాలతో పాటు అక్షరాభ్యాసం, కుంకుమార్చనలు చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

- ధరూరు మండల కేంద్రంలోని కాళికాదేవి ఆలయంలో కోట యూత్ ఆధ్వర్యంలో అమ్మవారిని సరస్వతీదేవిగా అలంకరించారు. అనంతరం అర్చకులు కిష్టాచార్యులు అభిషేకాలు, కుంకుమార్చన పూజలు చేశారు.
- రాజోళిలో మండల కేంద్రంలోని పలు ఆలయాల్లో అమ్మవారు సరస్వతీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.
- అయిజ మండల కేంద్రంలోని కాళికాదేవి ఆలయంలో అమ్మవారు సరస్వతి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు.
- శాంతినగర్‌లోని కోయిల్‌దిన్నె రోడ్డు సమీపంలో వెలసిన కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారు సరస్వతీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి అభిషేకాలు, అర్చనలు, హోమాలు జరిపించారు. చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అన్నప్రసాదం, అల్పాహార వితరణ గావించారు.
- మానవపాడు మండలంలోని అమరవాయిలో అమ్మవారు సరస్వతీదేవిగా దర్శనమిచ్చారు. పండితులు శ్రీకాంత్‌శర్మ ఆధ్వర్యంలో పూజలు చేశారు.
- మల్దకల్ మండల కేంద్రంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారు సరస్వతీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. మార్కండేయస్వామి ఆలయం, బిజ్వారం, బూడిదపాడు, ఎల్కూరు గ్రామాల్లో అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు బాదం శ్రీనివాసులు, మనసాని నాగరాజు, రామకృష్ణ, వెంకటేష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.
- ఇటిక్యాల మండల పరిధిలోని పెద్దదిన్నె వేంకటేశ్వరస్వామి ఆలయంలో సరస్వతీదేవి అలంకరణలో, చాగాపురం భవానీయూత్, షాబాద్ శివాజీ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపాల వద్ద ప్రత్యేక పూజలు చేశారు.



శాంతినగర్‌లో సరస్వతీదేవి అలంకరణలో..



ధరూరులో ఆలయంలో..



ఇటిక్యాల మండలం షాబాద్‌లో..



అయిజలో సరస్వతీదేవిగా..



పచ్చర్లలో సరస్వతీదేవిగా..



మల్దకల్ సరస్వతీదేవి అలంకరణలో అమ్మవారు